సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 13 । మార్చి । 2023



సెలవుపై వచ్చి.. మృత్యుఒడికి

సెలవుపై వచ్చిన ఓ బీఎస్ఎఫ్ జవాన్ గంటల వ్యవధిలోనే మృతి చెందారు. 8లో



టమాట కిలో రూ.20


కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్టంగా రూ.20 పలికింది. మార్కెట్‌కు 250 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి. కనిష్టం రూ.5, సరాసరి రూ.10 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.8°/12.1°

జిల్లా పరిధిలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చాలా ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో గాలివేగం పెరిగింది. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

స్వీయ పరివర్తనతోనే పరిపూర్ణత



ప్రసంగిస్తున్న నిమిష్‌పాండ్య

ప్రశాంతి నిలయం: మనిషి సద్గుణాలను కలిగి జీవన మార్గంలో స్వీయపరివర్తన పొందడం ద్వారా పరిపూర్ణులవుతారని సత్యసాయి సేవా సంస్థల దేశీయ అధ్యక్షుడు నిమిష్ పాండ్య తెలిపారు. సత్యసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో మూడు రోజుల జాతీయ లీడర్ షిప్ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ముగింపు వేడుకలను సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న యువతీ, యువకులు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులతో కలసి వేదపఠనంతో భారత జాతీయ పతాకం, సత్యసాయి సేవా సంస్థల , సర్వధర్మ పతాకాలతో సాయికుల్వంత్ సభా మందిరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిమిష్ పాండ్యా మాట్లాడుతూ లీడర్ షిప్ కోర్సులో పొందిన జ్ఞానాన్ని, నేర్చుకున్న అంశాలను నిత్య జీవితంగా సాధన చేయాలన్నారు. ఆ తర్వాత సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్‌రాజు, నిమిష్ పాండ్య, విజయ్ ఎల్ కేల్కర్, నాగానంద, సత్యసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ చక్రవర్తి 'ప్రేరణ' పేరుతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.



ప్రేరణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

పోలింగ్ డే



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్



ఆర్టీసీ బస్సుల్లో పోలింగ్ బాక్సులను తరలిస్తున్న సిబ్బంది



- నేడు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 దాకా పోలింగ్
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు

పుట్టపర్తి అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ సాగనుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 49 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

86 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలోని 32 మండలాలకూ పోలింగ్ సిబ్బంది ఆదివారం ఎన్నికల సామగ్రి సిద్ధం చేసుకొని ప్రత్యేక బస్సుల్లో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. పుట్టపర్తిలోని చిన్నపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి 30 రకాల ఎన్నికల సామగ్రిని అధికారులు వారికి అందజేశారు. 11 రూట్లు 86 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. పట్టభద్రులకు 54, ఉపాధ్యాయులకు 32 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 13 సాధారణ, 11 సమస్యాత్మక, 8 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 20 సాధారణ, 18 సమస్యాత్మక, 16 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు వివరించారు.

198 జంబో బ్యాలెట్ బాక్సులు

ఉపాధ్యాయ ఎన్నికల కోసం 46 మంది పీఓలు, 47 మంది ఏపీఓలు, పట్టభద్రుల కోసం 67 మంది పీఓలు, 60 మంది ఏపీఓలను నియమించినట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. అలాగే 108 మంది అబ్జర్వర్లను నియమించినట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల ఎన్నికకు 198 జంబో బ్యాలెట్ బాక్సులు, ఉపాధ్యాయులకు 37 బిగ్ బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేశామన్నారు.

ప్రశాంత వాతావరణంలో పోలింగ్

సోమవారం జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. పట్టభద్రులకు సంబంధించి 43,310 మంది ఓటర్లు, ఉపాధ్యాయ ఎన్నికకు 3,348 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

పోలింగ్ సిబ్బందికి డీఆర్‌ఓ సూచనలు

పోలింగ్ విధులకు వెళ్తున్న సిబ్బందికి డీఆర్‌ఓ కొండయ్య ప్రత్యేక సూచనలిచ్చారు. పోలింగ్ విధులు ముగిసిన అనంతరం పక్కాగా సామగ్రిని అందజేయాలన్నారు. బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలో భద్రపరచాలన్నారు. పట్టభద్రుల బ్యాలెట్ పత్రం చాలా పెద్దగా ఉండటంతో దాన్ని ఎలా బాక్సులో వేయాలో వివరించారు.

జిల్లాలో పట్టభద్ర ఓటర్లు	43,310
ఉపాధ్యాయ ఓటర్లు	3,348
పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు	54
ఉపాధ్యాయులకు...	32

ఇబ్బంది వస్తే వెంటనే చెప్పండి

ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తున్న చిన్నపల్లి ఉన్నత పాఠశాలను ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పరిశీలించారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే సమీప పోలీస్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. లేదా 100కు కాల్ చేయాలన్నారు. సుమారు 1550 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నట్లు చెప్పారు.

86 కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి జిల్లాలో ఏర్పాటు చేసిన 86 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్, ఫొటోగ్రఫీ ఏర్పాట్లను కలెక్టర్ బసంత్‌కుమార్ పరిశీలించారు. ఆదివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వాటిని పర్యవేక్షించారు. వెబ్‌క్యాస్టింగ్, వీడియోగ్రఫీ సరిగా కనిపించని చోట చూసి సరిచేయించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. మొబైల్ నంబర్ 9154968576కి ఫోన్ చేసి సమస్య చెప్పవచ్చన్నారు. 13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

వైభవంగా భూతప్పల ఉత్సవం



భక్తులపై కాలు మోపుతూ వస్తున్న భూతప్ప

రొళ్ల: లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రొళ్లలో ఆదివారం భూతప్పల ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి శనివారం సాయంత్రమే వేల సంఖ్యలో భక్తులు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈరముద్దమ్మదేవి ఆలయం వద్ద నుంచి దేవాలయం ఆవరణ వరకు రోడ్డుపై కిలో మీటర్ల మేర భూతప్పల రాక కోసం భక్తులు బోర్లా పడుకున్నారు. తొలుత మారుతీ కాలనీ సమీపంలోని ముత్తరాయస్వామి దేవాలయంలో భూతప్పలు ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాలతో పాదాల బండ వద్ద నుంచి నృత్య చేస్తూ ఆలయం వద్దకు చేరారు. అనంతరం తడి బట్టలతో బోర్లాపడుకున్న భక్తులపై భూతప్పలు నాట్యమాడుతూ.. కాలు మోపుతూ ముందుకు సాగారు. భూతప్పల కాలి స్పర్శతో రోగాలు నయమవుతాయని, సంతానం భాగ్యం లేని మహిళలకు సంతానం కలుగుతుందని, పెళ్లి కాని యువతులకు పెళ్లిళ్ల జరుగుతాయని భక్తుల విశ్వాసం. మేళతాళలతో భూతప్పలు ప్రధాన ఆలయ ప్రాంగణం చేరుకుని చుట్టు ప్రదక్షిణలు చేశారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేయించుకుని సమీపాన ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు చేరుకుని పూజలు అందుకున్నారు. తర్వాత ఆంజనేయస్వామి ఆలయం ఆవరణం ముందు భాగాన భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు సమర్పించిన బొరుగులు రాసి చుట్టూ ఉరాలు కొడుతుండగా భూతప్పలు నాట్యమాడారు. తర్వాత భక్తులు రాశిగా పోసి ఉంచిన బొరుగులను భూతప్పలు (రాసిని) బుజించారు.



అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



రథాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది

రారండోయ్ తేరును చూద్దాం

- నేడు లక్ష్మీ నారసింహుడి బ్రహ్మ రథోత్సవం
- దేశంలో మూడవది, తెలుగు రాష్ట్రాల్లో పెద్ద రథం
- లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని అంచనా

అందరూ వేయి కళ్లతో ఎదురు చూస్తున్న కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం రానే వచ్చింది. సోమవారం ఉదయం రథానికి పూజలు నిర్వహించి తేరును లాగనున్నారు. లక్షలాదిగా తరలిరానున్న భక్తజన సందోహం మధ్య నారసింహుడి బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కదిరి: నారసింహుని బ్రహ్మ రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 7 నుంచి 7.45 గంటల మధ్య అనురాధా నక్షత్రంలో శుభ మీన లగ్న పుష్కరాంశంలో తేరు ప్రారంభించేందుకు ఆలయ అర్చక పండితులు శుభ సమయంగా నిర్ణయించారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉత్సవం ఇది. ఇప్పటికే ఆలయ ప్రాంగణంతో పాటు తిరు వీధుల గుండా ఉన్న భవనాలు సైతం భక్తులతో కిట కిటలాడి పోతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో నారసింహుడు తిరు వీధుల్లో విహరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించడానికి దేవతలు తమ వాహనాలను పంపుతారని భక్తుల నమ్మకం. సాక్షాత్తూ బ్రహ్మదేవుడే శ్రీవారి రథోత్సవం నాడు రథాన్ని నడిపి స్వామి వారు విహరించడానికి సహకరిస్తారని, అందుకే బ్రహ్మ రథోత్సవం అంటారని ప్రధాన ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు.

దేశంలోనే మూడవ పెద్ద రథం

తమిళనాడు ఆండాల్ అమ్మవారి శ్రీవల్లి పుత్తూరు రథం, తంజావూర్ జిల్లాలోని తిరువార్ రథం తర్వాత దేశంలో అతి పెద్ద రథంగా కదిరి తేరు ప్రసిద్ధి చెందింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోకెల్లా అతిపెద్ద బ్రహ్మ రథం ఇదే. ఈ రథం సుమారు 540 టన్నుల బరువు, 37.5 అడుగుల ఎత్తు ఉంది. రథంలోని పీఠం వెడల్పు 16 అడుగులు. 120 ఏళ్ల క్రితం తయారు చేసిన రథం చక్రాలు ఒక అడుగు, ఒక అంగుళం వెడల్పుతో పాటు 8 అడుగుల వ్యాసంతో ఉన్నాయి. రథంపై సుమారు 256 శిల్ప కళాకృతులను టేకుతో అందంగా చెక్కారు. వివిధ భంగిమల్లో చెక్కిన ఈ బొమ్మలు అప్పటి శిల్ప కళా నైపుణ్యానికి నిదర్శనం. రథ చక్రాలకు రెండేళ్ల క్రితం తాత్కాలిక మరమ్మతులు చేశారు.

3 లక్షల మందికిపైగా భక్తులు..

ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా నారసింహుడు బ్రహ్మరథోత్సవానికి భక్తులు లక్షలాదిగా తరలిరానున్నారు. 3 లక్షల మందికి పైగా భక్తులు రథోత్సవంలో పాల్గొంటారని పోలీసు వర్గాలు అంచనా వేస్తున్నాయి. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నీటి సౌకర్యంతో పాటు దాతల సహకారంతో అడుగడుగునా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పటిష్ట బందోబస్తు

పుట్టపర్తి అర్బన్: కదిరి పట్టణంలో సోమవారం జరగనున్న ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పేర్కొన్నారు. రథోత్సవానికి ముగ్గురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, 210 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 90 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు, 100 మంది హోంగార్డులు, ఏపీఎస్పీ ఒక ప్లటూన్ (26 మంది)ను నియమించామన్నారు. ఇదే రోజున ఎమ్మెల్సీ ఎన్నికలు పట్టణంలో జరుగుతున్నాయి కాబట్టి భక్తులందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాలు ముగిసేలా చూడాలన్నారు.

ఐక్యూఏసీ తోడ్పాటుకు ప్రొఫెసర్ల కమిటీ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం న్యాక్ గుర్తింపుకు దరఖాస్తు చేసిన నేపథ్యంలో వర్సిటీ ఐక్యూఏసీ (ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్– అంతర్గత నాణ్యత ప్రమాణాల మదింపు కమిటీ) పనితీరు మెరుగుపరచడానికి వీలుగా ప్రొఫెసర్ల కమిటీని నియమించారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ఉత్తర్వులు జారీ చేశారు. కే.రాంగోపాల్ , వి. మాధవి ,డాక్టర్ పి. తిమ్మయ్య , డి. చంద్రమౌళిరెడ్డి , డాక్టర్ సీహెచ్ కృష్ణుడు , బి. జెస్సీ , సంధ్యారాణి కమిటీలో ఉన్నారు. వీరితో పాటు సెరికల్చర్ విభాగం టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ పి. లక్ష్మీనారాయణరెడ్డి , సోషల్ వర్క్ విభాగం టీచింగ్ అసిస్టెంట్ డి. శ్రీనివాస రెడ్డి న్యాక్ అక్రిడిటేషన్ ప్రక్రియలో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు.

ఐరావతంపై వసంత వల్లభుడు

- ప్రత్యేక పూజలు, హోమాలు చేసిన అర్చకులు
- భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీ ఆలయం





ఐరావతంపై నృసింహుడి దర్శనం , భక్తులతో కిటకిటలాడుతున్న ఖాద్రీశుడి ఆలయ ప్రాంగణం

కదిరి: వసంత వల్లభుడిగా పేరు గాంచిన ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఐరావతం (గజవాహనం)పై దర్శనమిచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగునున్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తాదులు నృసింహుని దర్శనం కోసం తరలివచ్చారు. హిరణ్య కస్యపుని సంహరించిన తర్వాత నారసింహుడి ఉగ్ర రూపాన్ని చూడలేని దేవతాగణం మరోసారి యథారూపంలో ప్రసన్నం కావాలని కోరుతారు. దీంతో స్వామి వారు అనుగ్రహించి వారి కోరిక మేరకు ఐరావతంపై దర్శనమిస్తారని భక్తుల నమ్మకం. ఆలయ అర్చకులు తొలుత యాగశాలలో నిత్య హోమాలు నిర్వహించి రథ కలశ పూజలు చేసిన తర్వాత శ్రీవారి బ్రహ్మ రథంపై ప్రతిష్ఠించారు. శ్రీవారికి నిత్య కైంకర్య సేవలు నిర్వహించిన అనంతరం బ్రహ్మరథం వద్ద శుద్ధ పుణ్యాహవచనం, వాస్తుహోమం, రథాంగ హోమం, రథ సంప్రోక్షణ చేశారు. ఐరావతంపై ఊరేగిన అనంతరం శ్రీవారు తిరిగి ఆలయంలోకి వెళ్లి పూజలనంతరం తెల్లవారుజామున రథంపైకి ప్రవేశించారు. శ్రీదేవి, భూదేవిలను కంకణ భట్టాచార్యులు రథంపైకి తీసుకొచ్చారు.

క్లుప్తంగా

బ్యాంక్ బీసీపై పోలీసులకు ఫిర్యాదు

రొద్దం: మండలంలోని పెద్దమంతూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ) దూదేకుల షుకూర్‌పై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు మహిళా సంఘం సభ్యురాలు సావిత్రమ్మ ఫిర్యాదు చేసింది. తనకు తెలియకుండా తన బ్యాంక్ ఖాతా నుంచి విడతవారీగా రూ.8 వేలు కాజేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఇటీవల బ్యాంక్‌కు వెళ్లినప్పుడు ఖాతాలో నిల్వను పరిశీలించగా ఈ విషయం వెలుగు చూసిందని, దీనిపై షుకూర్‌ని నిలదీస్తే నగదు డ్రా చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపింది. తంలోనూ ఎంతో మందిని ఇదే తరహాలో మోసం చేసినట్లుగా వాపోయింది. ఫిర్యాదుపై విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు.

వ్యక్తి దుర్మరణం



లారీలో చిక్కుకుపోయిన డ్రైవర్ ఆనంద్ మృతదేహం

పెనుకొండ రూరల్: చెట్టును ఐచర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని మండ్య జిల్లా మద్దూరు నివాసి ఆనంద్ (42)కు భార్య లక్ష్మి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న ఆనంద్.. క్లీనర్ అభిలాష్‌తో కలసి ముదిగుబ్బ నుంచి పావగడకు ఆదివారం సాయంత్రం పశువుల ఎరువు లోడుతో బయలుదేరాడు. పెనుకొండ మండలం రాంపురం వద్దకు చేరుకోగానే ముందు టైర్ బరెస్ట్ అయింది. దీంతో ఐచర్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఘటనలో ఐచర్ ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అభిలాష్ సురక్షితంగా బయటపడ్డాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పెనుకొండ పోలీసులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పరిగి: వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. బీచిగానిపల్లికి చెందిన శివయ్య.. గత శనివారం పంచాయతీ పరిధిలోని పాత్రగానిపల్లికి వెళ్లాడు. ఆ సమయంలో శివయ్యను పాత్రగానిపల్లికి చెందిన నరసయ్య, నరహరి కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడి రక్త గాయాలు చేశారు. దీనిపై ఆదివారం బాధితుడు శివయ్య పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ అనంతరంనరసయ్య, నరహరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

నిర్లక్ష్యానికి తప్పదు భారీ మూల్యం

- జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు
- వాహనదారుల నిర్లక్ష్యమే కారణమంటున్న అధికారులు
- ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



ఎనిమిది నెలల క్రితం బత్తలపల్లి మండలం నల్లబోయినపల్లి వద్ద జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఓ కారు రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఘటనలో వైఎస్సార్ జిల్లా రిమ్స్‌లో పనిచేస్తున్న వైద్యుడు డాక్టర్ బుక్కా శ్రీనివాస నాయక్ ప్రాణాలు కోల్పోయాడు. అంతకు ముందు వేగంగా వస్తున్న కారును నడుపుతున్న ఆయన.. ఎదురుగా వెళుతున్న ద్విచక్ర వాహనదారుడిని తప్పించే క్రమంలో నియంత్రణ కోల్పోయి కారుతో సహ బావిలోకి దూసుకెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది. అయితే బావి చుట్టూ సైడ్‌వాల్స్ ఏర్పాటు చేసి ఉంటే ఆ డాక్టర్ ప్రాణాలతో బయటపడేవాడు.

చెన్నై హైవేపై నల్లబోయినపల్లి వద్ద బావిలో పడిన కారు (ఫైల్)



చెన్నై హైవే పక్కనే చెట్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న బావి

ధర్మవరం: వాహన చోదకుల అతి వేగం.. నిర్లక్ష్యం ఎందరో ప్రాణాలను బలిగొంటోంది. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా తరచూ ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అతి వేగమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. కొన్ని ప్రమాదాల్లో వాహనదారులు మృత్యువాతపడగా.. మరికొన్నింటిలో వందలాది మంది క్షతగాత్రులు వికలాంగులుగా మారారు. వాహనాలను నడిపే సమయంలో కాసింత నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి ధర్మవరం నియోజకవర్గంలో మరీ ఎక్కువగా ఉంది. అనంతపురం నుంచి కదిరి వరకూ ఉన్న జాతీయ రహదారిపై ఎన్నో గ్రామాలుకు ఏర్పాటు చేసిన లింక్ రోడ్డుల వద్ద వేగనిరోధకాలు, ప్రమాద సూచికలు లేకపోవడం మరిన్ని ప్రమాదాలకు కారణమవుతోంది. దీంతో ధర్మవరం మండలం సీతారాంపల్లి నుంచి కనగానపల్లి మండలం మామిళ్లపల్లి వరకు, బత్తలపల్లి మండలం ముష్టూరు క్రాస్, జ్వాలాపురం క్రాస్, గంటాపురం క్రాస్ తదితర ప్రాంతాలను హై రిస్క్ జోన్‌లుగా అధికారులు గుర్తించారు.

సాధారణ రహదారుల్లోనూ

జాతీయ రహదారిపైనే కాదు.. గ్రామీణ రహదారుల్లోనూ వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మలుపుల వద్ద సరైన సూచికలు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ధర్మవరంలోని చెరువు కట్ట ఏడు మరువలు దాటే లోపు 8 ప్రమాదకరమైన మలుపులున్నాయి. ఈ మలుపుల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించుకోలేక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. వెంకటతిమ్మాపురానికి వెళ్లే మార్గంలో 2, మాలగుండ్లపల్లి, తుమ్మల, చిన్నూరు గ్రామాలకు వెళ్లే మార్గంలో ఆరు ప్రమాదకర మలుపులు ఉన్నాయి. బత్తలపల్లి మండలంలో మాల్యవంతం, నల్లబోయిన పల్లి, చిత్రావతి బ్రిడ్జి రెండు వైపులా ఉన్న మలుపుల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో పలువురు మృత్యువాతపడ్డారు. మాల్యవంతం నుంచి తాడిమర్రికి వెళ్లే మార్గంలోని మలుపులో రోడ్డు పక్కనే పెద్ద బావి ఉంది. వాహన చోదకులు ఏమాత్రం అదమరిచినా.. నేరుగా వెళ్లి బావిలో పడడం ఖాయం. తాడిమర్రి మండలంలో దాడితోట, చిల్లకొండయ్యపల్లి, పెద్దకోట్ల, పుల్లట్ల గ్రామాల వద్ద ఉన్న మలుపుల్లోనూ పెద్ద సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముదిగుబ్బ మండలంలో పాతూరు, రాళ్ల అనంతపురం వద్ద ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల వద్ద రోడ్డుకిరువైపులా భారీ ఎత్తున పొదలు విస్తరించాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ప్రమాదాలు నివారణకు అధికారుల చర్యలు

ప్రమాదాల నివారణకు పోలీసులు, రోడ్లు–భవనాల శాఖ, ఆర్టీఏ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాలను గుర్తించి హైరిస్క్ జోన్‌లు ప్రకటిస్తూ సూచికలు ఏర్పాటు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ మంజూరుకు ముందే దరఖాస్తుదారులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కదిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డీఎస్‌ఎం వరప్రసాద్ ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటు క్షేత్రస్థాయిలో వాహన తనిఖీల్లోనూ వేగంగా వెళుతున్న వాహన డ్రైవర్లను ఆపి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్య పరుస్తున్నారు.

లింక్ రోడ్డుల వద్దనే..



మేము తోట నుంచి ఇంటికి వెళ్లే సమయంలో జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాల బారిన పడిన ఎందరినో గుర్తిస్తుంటాం. ప్రధానంగా గ్రామాలకు ఏర్పాటు చేసిన లింక్ రోడ్డుల వద్దనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అతి వేగమే ఇందుకు కారణమని అనుకుంటున్నాం.

– బోయపాటి సూర్యనారాయణ, వెంకటగారిపల్లి, బత్తలపల్లి మండలం

చర్యలు చేపట్టాం



ధర్మవరం చుట్టూ జాతీయ రహదారికి అనుసంధానమైన గ్రామాల లింక్ రోడ్డు క్రాస్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు, ప్రమాదసూచికలు ఏర్పాటు చేశాం. హైరిస్క్ జోన్లను గుర్తించి, ప్రమాద సూచికలు ఏర్పాటు చేశాం. ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్లపై వేగనిరోధకాలను ఏర్పాటు చేస్తున్నాం.

– వెంకటసుబ్బయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ, ధర్మవరం

టీడీపీకి ఓటమి భయం

- అయోమయంలో ఓటరు కాని వ్యక్తులను ఓటు అభ్యర్థించిన నాయకులు

సాక్షి, పుట్టపర్తి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి ఖాయమని భావించిన తెలుగు తమ్ముళ్లు.. అడ్డదారులు తొక్కారు. ఓ వైపు అధికార వైఎస్సార్‌సీపీపై అసత్య ప్రచారం సాగిస్తూనే.. మరో వైపు ప్రచారం పేరుతో ఓటరు కాని వ్యక్తులను నేరుగా కలసి తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలంటూ అభ్యర్థించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉనికి చాటుకునేందుకు టీడీపీ నాయకులు పడుతున్న తాపత్రయం కాస్త అభాసుపాలైంది.

పోలింగ్‌కు ముందే చేతులెత్తేసి..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగూ గెలవలేమని తెలుసుకున్న జిల్లా టీడీపీ నాయకులు పోలింగ్‌కు ముందే చేతులు ఎత్తేశారు. ఉపాధ్యాయ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాపోవడంతో ఆ కోటా నుంచి స్వచ్ఛందంగా పార్టీ తప్పుకున్నట్లింది. ఇది కాస్త టీడీపీ నాయకులను మరింత బలహీనపరిచింది. తాము పార్టీలో ఉండాలా? వద్దా? అనే సందేహంలో చాలా మంది పడ్డారు. ఈ క్రమంలో పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలంటూ పార్టీ కేడర్‌ను టీడీపీ పెద్దలు ఆదేశించడం వారిని మరింత ఇరకాటంలో పడేసింది. దీంతో తన విజయానికి జిల్లాలోని బడా నేతలు ఎవరూ సహకరించదకపోవడంతో టీడీపీ పట్టభద్రుల అభ్యర్థి రామగోపాలరెడ్డి నేరుగా చంద్రబాబును కలసి తన గోడు వెల్లబోసుకున్నట్లు సమాచారం.



వృత్తంలో ఉన్న ఈ వ్యక్తి కనీసం పదో తరగతి కూడా పూర్తి చేయలేదు. అయితే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలంటూ టీడీపీ నాయకులు వెళ్లి అభ్యర్థించారు. ఓటు హక్కు లేని వ్యక్తి వద్దకెళ్లి ఓటు అభ్యర్థించడం కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అందరూ నవ్వుకున్నారు. ఓటమి భయం వెన్నాడుతుండడంతో తాము ఏమి చేస్తున్నామో తెలియని అయోమయంలో టీడీపీ నాయకులు పడ్డారనేందుకు ఇదో నిదర్శనం మాత్రమే.


వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం



టీడీపీ ఎన్ని కుయుక్తులు చేసినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఘన విజయం సాధించడం ఖాయం. ఓటర్లందరూ సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలిచారు. ఉపాధ్యాయ కోటాలో కనీసం పోటీ కూడా చేయకుండా తప్పుకున్న టీడీపీపై ఆ పార్టీ కేడర్ నమ్మకం కోల్పోయింది. టీడీపీ అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మొద్దు.

– మాలగుండ్ల శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

నాటి ఖాద్రి.. నేటి కదిరి





కదిరి పట్టణం (ఏరియల్ వ్యూ)

కదిరి: పూర్వం ఖాద్రిగా పిలుచుకునే ప్రాంతమే నేడు కదిరిగా మారింది. సంస్కృతంలో 'ఖా' అంటే విష్ణు పాదం అని అర్థం. అద్రి అంటే కొండ. ఈ రెండింటినీ కలిపి ఖాద్రి (విష్ణువు పాదం మోపిన కొండ)గా అప్పట్లో పిలిచేవారు. కాలక్రమేణా... ఖాద్రి కాస్త కదిరిగా మారిపోయింది. దేశంలోని అత్యధికంగా ప్రతిష్టిత ఆలయాలు ఉండగా.. మరికొన్ని స్వయంభువుగా వెలసినవి ఉన్నాయి. ఇందులో ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం కూడా ఒకటి. ఆలయ చరిత్రను పరిశీలిస్తే.. పూర్వం హిరణ్యకశ్యపుడి సంహారం అనంతరం ఖాద్రీ ప్రాంతంలో సంచరిస్తున్న నారసింహుడి ఉగ్రరూపాన్ని శాంతింపచేయడానికి దేవతల అభ్యర్థన మేరకు ప్రహ్లాదుడు స్తుతిస్తాడు. దీంతో సంతుష్టుడైన నారసింహుడు ప్రహ్లాదుడిని దగ్గరకు తీసుకుని ఆశీర్వదిస్తాడు. ఈ ఘట్టాన్ని ఆవిష్కరిస్తున్నట్లుగా కదిరి ఆలయంలో ప్రహ్లాద సమేతంగా నారసింహుడు భక్తులకు దర్శనమిస్తున్నారు. క్రీ.శ. 10వ శతాబ్దంలో పట్నం పాలేగారు రంగనాయకులుకు స్వామి స్వప్నంలో కనిపించి ఆదేశించిన మేరకు ఖాద్రి వృక్షం కింద తవ్వకాలు చేపడతాడు. ఆ సమయంలో బయటపడిన ప్రహ్లాద సమేత నారసింహుడి విగ్రహాన్ని ప్రతిష్టించి ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. అప్పటి నుంచి భక్తవరదాయుడిగా ఇక్కడి లక్ష్మీనారసింహస్వామి పూజలు అందుకుంటున్నారు.

సెలవుపై వచ్చి.. మృత్యుఒడికి

- రోడ్డు ప్రమాదంలో బీఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ దుర్మరణం
- ఆదివారం తెల్లవారుజామున ఇంటికి చేరుకున్న జవాన్
- మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ప్రమాదం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు





సోమశేఖరరెడ్డి (ఫైల్), రోదిస్తున్న భార్య స్వర్ణకుమారి

ఓడీ చెరువు: 'మూడు వారాల సెలవు తీసుకున్నా.. సర్‌ప్రైజ్ చేద్దామని ముందుగా ఎవరితోనూ చెప్పలేదు. ఈ రోజే ఇంటికి వస్తున్నా.. కొత్త ఇంట్లో అందరితో ఉగాది పండుగ చేసుకుందాం. మీ అమ్మావాళ్లని కూడా రమ్మను' అంటూ శనివారం రాత్రి భార్యకు ఫోన్ కాల్ చేసిన బీఎస్‌ఎఫ్ జవాన్... అనంతరం కుటుంబసభ్యులతో సరదాగా గడపకనే దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... తనకల్లు మండలం మండ్లిపల్లికి చెందిన కృష్టారెడ్డి కుమారుడు సోమశేఖరరెడ్డి (39) బీఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా 2004లో చేరారు. ఆయనకు భార్య స్వర్ణకుమారి, ఆరేళ్ల వయసున్న కుమార్తె కీర్తి, మూడేళ్ల వయసున్న మరో కుమార్తె అనన్య ఉన్నారు. గత ఏడాది ఓడీచెరువు మండలం వేమారెడ్డిపల్లిలో గృహాన్ని కొనుగోలు చేసి, తల్లిదండ్రులతో కలసి స్థిరపడ్డారు. బెంగళూరులోని బీఎస్‌ఎఫ్ క్యాంప్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సోమశేఖరరెడ్డి మూడు వారాల సెలవుపై ఆదివారం వేకువజాము ఒంటి గంటకు ఇంటికి చేరుకున్నాడు. మధ్యాహ్నం వరకూ కుటుంబసభ్యులతో గడిపిన ఆయన మధ్యాహ్నం 3 గంటలకు చికెన్ తీసుకువస్తానంటూ ద్విచక్రవాహనంపై ఓడీ చెరువుకు బయలుదేరాడు. కిలోమీటరు దూరం వెళ్లగానే జెరికుంటపల్లి ధాబా వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఘటనలో ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడిన సోమశేఖరరెడ్డికి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గోపి అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వైభవం.. రథోత్సవం



పావగడ: తాలూకాలోని కరెక్యాతనహళ్లి, మద్దె గ్రామాల లో వెలసిన స్వారమ్మ దేవి, శంకరలింగేశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య స్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి రథంలో ప్రతిష్ఠించారు. అనంతరం వేలాది మంది భక్తుల మధ్య రథోత్సవం సాగింది. స్వారమ్మ తల్లి, శంకరలింగేశ్వర స్వామికి జేజేలు పలుకుతూ భక్తుల రథం వెంట వడివడిగా నడిచారు. భక్తులు రథం మీదికి అరటి పండ్లు విసిరి మొక్కలు తీర్చుకున్నారు. రథం వెలుగులతో సాయంత్రం చీకటి కూడా వెన్నెల విరిసింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు చీకటిలో కూడా రథాన్ని దర్శించుకోవడం విశేషం.

శాంతికి చిహ్నం ఇస్లాం

- అల్లాహ్ మార్గంలోనే మోక్షం
- ప్రత్యేక ప్రార్థనలతో ముగిసిన ఇస్తెమా



ప్రత్యేకప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: హింసకు వ్యతిరేకం ఇస్లామని, ఇతరులను ఇబ్బంది పెట్టడం ఇస్లాం ధర్మం కాదని మౌలానా ఉమర్ సాహెబ్ బోధించారు. అనంత నగర శివారులోని ఆటో నగర్‌లో ఏర్పాటు చేసిన ఇస్తెమా కార్యక్రమం ఆదివారం రాత్రి ముగిసింది. లక్షలాది మంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమర్ సాహెబ్ ఆధ్యాత్మిక ప్రసంగం కొనసాగిస్తూ.. సర్వమానవాళి సుఖ సంతోషాలతో, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇతరుల హక్కులను కాలరాయడం, వారిని హింసించి ఇబ్బందులకు గురి చేయడం ఇస్లాం సహించదని, ఆ దిశగా ప్రతి ఒక్క ముస్లిమూ నడుచుకోవాలని పిలుపునిచ్చారు.

మంచి తనమే ఉన్నతికి కారణం

మంచితనంతో అల్లా కృప పొందిన ప్రతి ఒక్కరూ ఇహ, పర లోకాల్లో ఉన్నత స్థానంలో ఉంటారన్నారు. అలాంటి వారి కోసం స్వర్గలోక ద్వారాలు తెరిచి ఉంటాయన్నారు. మహమ్మద్ ప్రవక్త పాటించిన నియమాలను వివరిస్తూ... స్వార్థం, నిరాశ, నిస్పృహ, ఇతరుల పట్ల ద్వేషం వీడాలని, సర్వజీవులపై ప్రేమానురాగాలు కలిగి ఉండాలని సూచించారు. జీవితంలో చేసిన పాప, పుణ్యాలే మరణించిన తర్వాత లెక్కించబడతాయన్నారు. జనన, మరణాల్లో ఎలాంటి తారతమ్యాలు లేవనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మంచితనమనేది ఇస్లాముకు ప్రతిరూపమని పేర్కొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నిఖా

ఇస్తెమాకు హాజరైన లక్షలాది మంది ప్రత్యేక ప్రార్థనల మధ్య 15 జంటలకు అంగరంగ వైభవంగా నిఖా జరిపించారు. చివరగా సర్వమానవాళి శాంతి, ఈ ప్రాంతం సుభిక్షాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక దువా ఆచరించారు.

పాల్గొన్న ఎమ్మెల్యేలు, మేయర్

ఆదివారం నిర్వహించిన ఇస్తెమా ప్రత్యేక ప్రార్థనల్లో అనంతపురం, రాప్తాడు ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ నదీం అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఇస్తెమా ప్రాముఖ్యతను మత పెద్దలు, మౌలానాలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ ఖాజా, కార్పొరేటర్లు ఇషాక్, రహంతుల్లా, బాబాఫక్రుద్దీన్, మునిసిపల్ మాజీ చైర్మన్ నూర్ మహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, రఫి, జావీద్, నిర్వాహకులు అమీర్ సాబ్, ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలతో పాటు కర్ణాటకలోని బళ్లారి, రాయచూర్, హోస్పేట, బెంగళూరు, మైసూరు, హుబ్లీ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన లక్షలాదిమంది ముస్లింలు పాల్గొన్నారు.